kalamdaily.com

కలం
ప్రజల గళం...

Follow on: Kalamtelugu

సోమవారం ● 13-04-2026

పేజీలు: 4

360° SINGLE TOPIC

రుజువుకాని నేరానికి శిక్ష



# అండర్ ట్రయల్ ఖైదీ.. జైల్లోనే బందీ!

## నేరం రుజువు కాక ఏండ్లకేండ్లు కటకటాల్లోనే

## విచారణలో జాప్యంతో బలవుతున్న జీవితాలు

## పేదరికం.. బెయిల్‌పై అవగాహన లేక లైఫంతా జైలే

## దేశంలో మొత్తం ఖైదీల్లో 75% మంది వాళ్లే

నేరం రుజువు కాలేదు.. శిక్ష ఖరారు కాలేదు.. కానీ, నాలుగు గోడల మధ్య వారి యవ్వనం కరిగిపోతున్నది. కండ్ల ముందే జీవితం శిథిలమవుతున్నా చూస్తూ ఉండిపోవడం తప్ప వారు చేయగలిగేదేమీ లేదు. బెయిల్ పిటిషన్ వేయాలన్న అవగాహన లేక కొందరు.. అవగాహన ఉన్నా చేతిలో డబ్బులు లేక ఇంకొందరు.. అండర్ ట్రయల్ ఖైదీల పేరుతో జైళ్లలోనే ఏండ్లకేండ్లు  మగ్గిపోతున్నారు. కన్నవాళ్లను, కట్టుకున్నవాళ్లను, కడుపున పుట్టినవాళ్లను చూడలేక, కనీసం తమ గోడును వినే నాథుడు లేక.. ఆ చీకటి గదుల్లోనే ఎందరో అభాగ్యుల ఆశలు ఆవిరైపోతున్నాయి. శిక్షా కాలం కన్నా రెండింతలు ఎక్కువే విచారణ ఖైదీలుగా జీవితాన్ని గడుపుతున్నవాళ్లు కోకొల్లలు.

దేశంలో 5.10 లక్షల మంది ఖైదీలు ఉంటే.. 3.80 లక్షల మంది (75 శాతం) అండర్ ట్రయల్ ఖైదీలే. వీరిలో చాలా మంది విచారణ పేరిట మూడు నాలుగేండ్ల నుంచి జైలు జీవితం గడుపుతున్నవాళ్లే. కొందరైతే ముప్పై,  నలభై ఏండ్లు అండర్ ట్రయల్ ఖైదీలుగా 'రుజువుకాని నేరానికి శిక్ష'ను అనుభవించి బయటకు వచ్చినవాళ్లూ ఉన్నారు. తెలంగాణ జైళ్లలో 42,566 మంది ఖైదీలు ఉంటే.. వీరిలో 36,627 మంది అండర్ ట్రయల్ ఖైదీలే. విచారణలో తీవ్ర జాప్యం, కోర్టుల్లో న్యాయ సిబ్బంది కొరత, కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్న కేసులు.. ఇలా ఎన్నో కారణాలు ఎంతో మందిని అండర్ ట్రయల్ ఖైదీలుగా జైళ్లలో ఏండ్ల తరబడి బతుకీడ్చేలా చేస్తున్నాయి. పేద ఖైదీల కోసం ఉచిత న్యాయ సలహా ఉన్నా.. అది పేరుకే పరిమితమవుతున్నది. ఏటా రిపబ్లిక్ డే, పంద్రాగస్టు, గాంధీ జయంతి, అంబేద్కర్ జయంతి వంటి అకేషన్స్‌లో ప్రభుత్వాలు సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తుంటాయి. కానీ.. ఏండ్లకేండ్లు అండర్ ట్రయల్ ఖైదీలుగా జైళ్లలో మగ్గుతున్న వారికి  మాత్రం ఎలాంటి రిలీఫ్ దొరకడం లేదు. వీటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..


- సెంట్రల్ డెస్క్, కలం

### ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ



విచారణ పూర్తికాకుండానే ఏండ్ల తరబడి జైల్లో ఉండటం.. ఖైదీల ప్రాథమిక హక్కులను కాలరాయడమే. మన క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ఒక శిక్షగా మారింది. జైళ్లలో ఉన్న వారిలో 80% మంది అండర్ ట్రయల్స్ ఉండటం మన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు వాయిదాలు, లాయర్ల ఫీజులు... ఇవన్నీ కలిపి ఆ వ్యక్తిని మానసికగా, ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్నాయి. జైళ్ల నిర్వహణను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా సంస్కరణ కేంద్రాలుగా మార్చాలి. ఇన్వెస్టిగేషన్ సరిగ్గా, వేగంగా జరగకపోవడంతో విచారణ ఆలస్యమవుతున్నది. కోర్టులకు కావాల్సిన నిధులు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. న్యాయం అనేది కేవలం చదువుకున్న వారికి, ధనవంతులకు మాత్రమే పరిమితం కాకూడదు. మారుమూల గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులకు కూడా తమ హక్కుల గురించి తెలియాలి.

- జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ సీజేఐ




### రూ. 5 వేలు లేక.. అదనంగా ఏడాదిన్నర శిక్ష

తెలంగాణలో దొంగతనం కేసులో అరెస్ట్ అయిన వ్యక్తికి 2023లో బెయిల్ వచ్చింది. కానీ, బెయిల్ ష్యూరిటీగా పెట్టడానికి రూ.5వేలు లేకపోవడంతో మరో ఏడాదిన్నర పాటు జైల్లోనే ఉండాల్సి వచ్చింది. ఇది పేదరికం వల్ల శిక్ష అనుభవించే పరిస్థితి అనివార్యం అవుతున్నది.

### 40 ఏండ్లు విచారణలోనే!

మహారాష్ట్రకు చెందిన బాబా సాహెబ్ థోరట్.. ఒక హత్య కేసులో నిందితుడిగా 40 ఏండ్ల పాటు అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. కేసు తీర్పు వచ్చేసరికి అతని వయస్సు 80ఏండ్లు దాటిపోయింది. నిర్దోషిగా బయటికొచ్చే సమయానికి అతని మానసిక పరిస్థితి సరిగ్గాలేదు.




## యవ్వనమంతా అండర్ ట్రయలే

1996లో ఢిల్లీలో జరిగిన లాజ్‌పత్ నగర్ పేలుళ్ల కేసులో మక్బూల్ షా అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. 14 ఏండ్ల పాటు తిహార్ జైల్లో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. 2010లో కోర్టు అతన్ని నిర్దోషి అని ప్రకటిస్తూ విడుదల చేసింది. జైలు నుంచి బయటికి వచ్చిన మక్బూల్.. ''నేను జైలుకు వెళ్లినప్పుడు నా తల్లిదండ్రులు బతికే ఉన్నారు. ఇప్పుడు లేరు. నా యవ్వనం జైలు పాలైంది. ఈ 14 ఏండ్ల కాలన్ని ఎవరు తిరిగి ఇస్తారు?'' అని అడిగిన ప్రశ్న అప్పట్లో దేశాన్ని ఆలోచింపజేసింది.

నల్గొండకు చెందిన సైదులు ఒక హత్య కేసులో 12 ఏండ్ల పాటు అండర్ ట్రయల్ ఖైదీగా జైలు జీవితం గడిపాడు. సాక్షుల విచారణలో జాప్యం, సరైన న్యాయం అందకపోవడంతో 12 ఏండ్లు గడిచిపోయాయి. సాక్ష్యాధారాలు లేవని కోర్టు అతన్ని నిర్దోషిగా విడుదల చేసింది. బయటకు వచ్చేసరికి అతని ఇల్లు కూలిపోయింది. భార్య పిల్లలు అతనికి దూరమయ్యారు.

యూపీకి చెందిన విష్ణు తివారీపై 2000లో ఓ అత్యాచార కేసు నమోదైంది. సరైన న్యాయ సహాయం అందక.. కేసు విచారణలో జాప్యంతో అతను 20 ఏండ్ల పాటు జైల్లోనే ఉన్నాడు. 2021లో అలహాబాద్ హైకోర్టు అతన్ని నిర్దోషిగా ప్రకటించింది. ''అతనిపై ఉన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవు. అసలు ఆ నేరమే జరగలేదు''అని కోర్టు కామెంట్ చేసింది. బయటికొచ్చేసరికి అతని కుటుంబం ఛిన్నాభిన్నమైంది. తండ్రి చనిపోయాడు.

## తెలంగాణ జైళ్లలో 36వేల మంది

తెలంగాణ జైళ్లలో అండర్ ట్రయల్ ఖైదీలు 36వేలకుపైగానే ఉన్నారు. గతేడాది తెలంగాణ జైళ్ల శాఖ విడుదల చేసిన 2025 వార్షిక నివేదిక, కేంద్ర న్యాయ శాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన గణాంకాల్లో ఇది తేలింది. రాష్ట్రంలో 2024 కంటే ఖైదీల సంఖ్య 12% పెరిగింది. 2025 నాటికి రాష్ట్రంలో మొత్తం ఖైదీలు 42,566 మంది ఉంటే అందులో 86 శాతం (36,627 మంది) అండర్ ట్రయల్ ఖైదీలే.

| వివరాలు | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ |
|---|---|---|
| మొత్తం ఖైదీలు | 42,566 | 28,000 (2025 నాటికి) |
| అండర్ ట్రయల్ ఖైదీలు | 36,627 | 19,000 |
| శిక్ష పడిన వాళ్లు | 5,856 | 6,000 |
| మహిళా ఖైదీలు | 2,800 | 1,500 |

తెలంగాణలో జైలుకు వచ్చే వారిలో 94% మంది మొదటిసారి నేరం చేసిన వారే. ఇలాంటివారు విచారణ పేరిట ఏండ్లకేండ్లు జైలు జీవితం గడపాల్సి వస్తున్నది.



## చోరీలు చేసి జైళ్లలో మగ్గుతూ..!

అండర్ ట్రయల్ ఖైదీలుగా జైలుకు వెళ్లే వారిలో అధిక శాతం మంది పేదరికం, అవగాహన రాహిత్యం లేదా క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల ఇరుక్కున్నవారే ఉంటున్నారని ఎన్‌సీఆర్‌బీ డేటా చెప్తున్నది. ఎక్కువ మంది చిన్న చిన్న వస్తువులు, సెల్ ఫోన్లు లేదా డబ్బు దొంగిలించినట్లు ఆరోపణలు ఎదుర్కొనేవారు ఉన్నారు. ఇండ్లలో చొరబడటం లేదా బలవంతంగా ఆస్తులను లాక్కోవడంతో జైలుపాలవుతున్నారు. భూతగాదాలు, పొరుగువారితో గొడవలు లేదా గ్రామాలలోని గ్రూపు తగాదాల వల్ల అటెంప్ట్ టు మర్డర్ కేసుల్లో ఇరుక్కుంటారు. ఇవి తీవ్రమైన కేసులు, వీటిలో బెయిల్ రావడం ఆలస్యం కావడం వల్ల వీరు ఎక్కువ కాలం అండర్ ట్రయల్స్‌గా ఉంటారు. గత దశాబ్ద కాలంలో ఈ తరహా కేసుల్లో అండర్ ట్రయల్స్ సంఖ్య పెరిగింది.

- భార్య లేదా ఆమె బంధువులు ఇచ్చే వరకట్న వేధింపుల ఫిర్యాదుల వల్ల భర్త, అతని కుటుంబ సభ్యులు జైలుకు వెళ్తున్నారు. రేప్, పోక్సో నాన్-బెయిలబుల్ కేసులు కావడంతో విచారణ ముగిసే వరకు ఖైదీలుగానే ఉండాల్సి వస్తుంది.
- మత్తు పదార్థాలను రవాణా చేస్తున్నారనే ఆరోపణలతో యువకులు ఈ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఈ చట్టం కింద నిబంధనలు కఠినంగా ఉండటం వల్ల వీరికి బెయిల్ లభించడం చాలా కష్టం.



## అమాయకులు బలి

2007, విజయవాడలో జరిగిన ఆయేషా మీరా హత్య కేసులో సత్యంబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. దిగువ కోర్టు అతనికి శిక్ష వేసినా.. అది అండర్ ట్రయల్, అప్పీల్ దశలోనే 10 ఏండ్లు గడిచింది. అతని ఆరోగ్యం దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకున్నాడు. చివరికి 2017లో హైకోర్టు అతన్ని నిర్దోషి అని తేల్చింది. అసలు నిందితుడిని వదిలేసి.. ఒక అమాయకుడిని బలి చేశారని పోలీసులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

## బెయిల్ ఇవ్వడానికి భయపడ్తున్నారు



బెయిల్ విషయంలో న్యాయ వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. చిన్న కేసుల్లో కూడా బెయిల్ ఇవ్వడానికి దిగువ కోర్టులు భయపడ్తున్నాయి. జిల్లా కోర్టుల జడ్జీలు వెనుకాడటంతో లక్షలాది మంది అనవసరంగా అండర్ ట్రయల్ ఖైదీలుగా జైళ్లలో మగ్గుతున్నారు. హైకోర్టులు, సుప్రీంకోర్టు బెయిల్ పిటిషన్లతో నిండిపోవడానికి ఇదే ప్రధాన కారణం. న్యాయం అనేది సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. టెక్నాలజీ ఉపయోగించి కేసుల పెండింగ్‌ను తగ్గించాలి. ఒక వ్యక్తిని విచారణ పూర్తికాకుండానే జైల్లో ఉంచడం అతని ప్రాథమిక హక్కులను హరించడమే. ఒక కేసును విచారించడానికి పట్టే కాలం, ఆ నేరానికి పడే శిక్ష కంటే ఎక్కువగా ఉన్నప్పుడు.. ఆ విచారణ ప్రక్రియే నిందితుడికి ఒక శిక్షగా మారుతున్నది. ఇది అండర్ ట్రయల్ ఖైదీల జీవితాలను నాశనం చేస్తోంది.

**- జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ సీజేఐ**

# రుజువుకాని నేరానికి శిక్ష



kalamdaily.com
Follow on: Kalamtelugu

## ఎన్నో గాథలు

- ముంబైకు చెందిన ఆదమ్ అజ్మీ ఉగ్రవాద ఆరోపణలతో 11 ఏండ్లు జైల్లో ఉన్నాడు. నిర్దోషిగా బయటకు వచ్చిన తర్వాత అతను ఓ పుస్తకం రాశాడు. ''జైలు గోడల మధ్య నా 11 ఏళ్ల కాలం కేవలం తేదీలు మార్చుకోవడానికే సరిపోయింది'' అని అతను రాసిన మాటలు వ్యవస్థపై ఆవేదనను వ్యక్తపరుస్తాయి.
- యూపీకి చెందిన మజార్ ఖాన్ 1980లో ఒక చిన్న గొడవలో అరెస్ట్ అయ్యాడు. విచారణ మొదలైంది కానీ.. ఏండ్ల తరబడి ముందుకు జరగలేదు. అధికారులు, లాయర్లు కూడా ఇతని గురించి మరిచిపోయారు. అతను అండర్ ట్రయల్ ఖైదీగానే 36 ఏండ్లు జైల్లో గడిపాడు. 2016లో ఒక స్వచ్ఛంద సంస్థ చొరవతో అతను బయటకు వచ్చాడు. జైలుకు వెళ్లినప్పుడు యవ్వనంలో ఉన్న మజార్.. బయటికొచ్చేసరికి 70 ఏండ్ల వృద్ధుడు. అతనికి తన ఇల్లు ఎక్కడుందో తెలియదు.. తనవాళ్లెవరో గుర్తులేదు.
- ఢిల్లీకి చెందిన అమీర్‌ఖాన్ 18 ఏండ్ల వయస్సులో ఉగ్రవాద ఆరోపణలతో అరెస్ట్ అయ్యాడు. 14 ఏండ్ల పాటు అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. ఆ సమయంలో అతని తండ్రి చనిపోయాడు. తల్లి పక్షవాతంతో మంచం పట్టింది. 2012లో కోర్టు అతన్ని నిర్దోషిగా ప్రకటించింది. బయటకు వచ్చాక అతను తన గోడును 'ఫ్రేమ్డ్ యాస్ ఏ టెర్రరిస్ట్' అనే పుస్తకం రాశాడు. ''నేను జైలు నుంచి బయటపడ్డాను కానీ.. నా 14 ఏండ్ల కాలాన్ని జైలు గోడలు మింగేశాయి''అని చెప్పుకొచ్చాడు.
- ఒక చిన్న కేసులో 1960లో బిహార్‌కు చెందిన జగన్ మెహతా అరెస్ట్ అయ్యాడు. జైలులో ఉండగా అతనికి మానసిక స్థితి బాగాలేదని పిచ్చి ముద్ర వేశారు. కోర్టులో విచారణ జరగలేదు. వైద్యం అందలేదు. ఒక మానసిక రోగిగా జైల్లోనే 38 ఏండ్లు ఉండిపోయాడు. సుప్రీం కోర్టు జోక్యంతో విడుదలయ్యేసరికి అతను తన పేరును కూడా మరిచిపోయాడు.

## బెయిల్ కోసం ఎంత ఖర్చు అవుతుంది?

ఒక పేద అండర్ ట్రయల్ ఖైదీకి న్యాయం కోసం అయ్యే ఖర్చు డబ్బుతో మాత్రమే ముడిపడి ఉండదు.. అది వారి కుటుంబ ఆర్థిక పునాదులనే కదిలిస్తుంది. దేశంలో న్యాయం చాలా ఖరీదైనది. పేదవారి కోసం ప్రభుత్వ ఉచిత న్యాయ సహాయం ఉన్నప్పటికీ, చాలా మంది ప్రైవేట్ లాయర్లనే ఆశ్రయిస్తుంటారు. లోయర్ కోర్టులో ఒక బెయిల్ పిటిషన్ దాఖలు చేయడానికి ఒక లాయర్ సగటున రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తారు. ఒకవేళ కింది కోర్టులో బెయిల్ రాకపోతే, హైకోర్టుకు వెళ్లడానికి రూ.25వేల నుంచి రూ.50వేలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చవుతుంది.

- ఎఫ్ఐఆర్, చార్జ్ షీట్, కోర్టు ఆర్డర్ కాపీలు పొందడానికి, ఇతర పేపర్ వర్క్ కోసం రూ.4వేల వరకు అవుతుంది.
- కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పుడు, ఒక నిర్దిష్ట మొత్తాన్ని (ఉదాహరణకు రూ.10వేల నుంచి రూ.50వేలు) డిపాజిట్ చేయమని లేదా అంతే మొత్తానికి షూరిటీ (పూచీకత్తు) ఇవ్వమని కోరుతుంది.
- పేద కుటుంబాలకు షూరిటీ ఇచ్చే వ్యక్తులు దొరకడం కష్టం. దీని కోసం వారు బయట వ్యక్తులకు కమీషన్ కింద రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఇచ్చుకోవాల్సి వస్తుంది.
- ఒక సాధారణ కేసులో ఒక పేద ఖైదీ బెయిల్ మీద బయటకు రావడానికి కనీసం రూ.50 వేల నుంచి 80 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఇది ఒక సగటు కూలీ లేదా పేద రైతు 2 నుంచి 3 ఏండ్ల సేవింగ్స్‌తో సమానం.
- అందుకే చాలా మంది పేద ఖైదీలు బెయిల్ వచ్చినా కట్టడానికి డబ్బులు లేక లేదంటే లాయర్‌ను పెట్టుకోలేక జైళ్లలోనే మగ్గిపోతున్నారు.

## న్యాయ వ్యవస్థలో ఆర్థిక అసమానత ఉండొద్దు

వ్యవస్థల్లో జాప్యం వల్ల నిర్దోషులు శిక్ష అనుభవిస్తున్నారు. సామాన్యుడికి కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక, స్తోమత లేవు. వ్యవస్థలో ఉన్న లోపాల వల్ల విచారణ పూర్తికాకుండానే పేదలు జైల్లో మగ్గుతున్నారు. ఇది వారి ప్రాణానికి, స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నది. జైల్లో ఉన్న మహిళా ఖైదీలు పారిశుధ్య, వైద్య సదుపాయాల పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక వ్యక్తి నేరస్థుడో.. కాదో.. తేలకముందే, కేవలం విచారణ పేరుతో ఏండ్ల తరబడి జైల్లో ఉంచడం ఆ వ్యక్తి ప్రాథమిక హక్కును కాలరాయడమే. న్యాయం అందడంలో జరిగే జాప్యం.. ఆ ఖైదీకి న్యాయాన్ని నిరాకరించడమే అవుతుంది. ఒక ధనవంతుడు సులభంగా బెయిల్ పొంది బయటకు వస్తున్నాడు. కానీ, ఒక పేదవాడు చిన్న దొంగతనం కేసులో కూడా షూరిటీ లేక జైల్లోనే మగ్గుతున్నాడు. ఈ ఆర్థిక అసమానత న్యాయ వ్యవస్థలో ఉండొద్దు. ప్రతి అండర్ ట్రయల్ ఖైదీకి సమర్థుడైన న్యాయవాదిని ప్రభుత్వమే అందించాలి. ఉచిత న్యాయ సహాయం అనేది కేవలం కాగితాల మీద ఉండటం కాదు, అది క్షేత్రస్థాయిలో ఖైదీకి అందాలి.

*- జస్టిస్ బీవీ నాగరత్న, సుప్రీంకోర్టు జడ్జి*

## కేసులు పేరుకుపోతున్నాయి

జడ్జీల కొరత వల్ల న్యాయవ్యవస్థ కుప్పకూలుతున్నది. లక్షలాది మంది సామాన్యులు న్యాయం కోసం దశాబ్దాలుగా వేచి చూస్తున్నారు. జడ్జీల నియామకాల్లో జాప్యం తగదు. ఒక జడ్జి ఏడాదికి సగటున 2,600 కేసులను పరిష్కరిస్తున్నారు. ఇంత పని ఒత్తిడి ఏ దేశంలోనూ లేదు. ఇంత పని భారాన్ని మోస్తూ కూడా మేము విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కోర్టుల్లో పేరుకుపోయిన కోట్ల కేసులను పరిష్కరించడానికి జడ్జీల సంఖ్యను పెంచాలి.కానీ, ప్రభుత్వం నియామకాల విషయంలో జాప్యం చేస్తున్నది. జడ్జీలు తక్కువగా ఉండటంతో విచారణలు ముందుకు సాగక, వేలాది మంది పేదవారు నిర్దోషులైనా జైల్లోనే ఉండాల్సి వస్తున్నది.

*- జస్టిస్ టీఎస్ ఠాకూర్, మాజీ సీజేఐ*




## కారణాలేంటి?

ఏండ్ల తరబడి అండర్ ట్రయల్ ఖైదీలు జైల్లో మగ్గడానికి ప్రధాన కారణం పేదరికం. చాలా మంది ఖైదీలకు బెయిల్ మంజూరైనప్పటికీ.. ష్యూరిటీ ఇచ్చేందుకు డబ్బు లేక జైల్లోనే ఉంటున్నారు. దీనికితోడు న్యాయ వ్యవస్థలో జాప్యం కూడా కారణం. కోర్టుల్లో లక్షలాది కేసులు పెండింగ్ లో ఉండటం, జడ్జీల కొరత కారణంగా విచారణలు ఏండ్ల తరబడి సాగుతున్నాయి. ప్రభుత్వ ఉచిత న్యాయ సహాయం అందరికీ సకాలంలో అందడం లేదు.

- దేశ వ్యాప్తంగా 3.80 లక్షల మంది అండర్ ట్రయల్ ఖైదీలు ఉన్నారు. జైళ్ల సామర్థ్యం కంటే 130 శాతంపైగా ఖైదీలను వాటిలో ఉంచుతున్నారు. యూపీ, ఢిల్లీ వంటి చోట్ల ఇది 180 శాతం దాటిపోయింది.
- ప్రతి జిల్లాలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ ఉంటుంది. అనవసరంగా జైలు జీవితం గడపాల్సి వస్తున్నవారిని గుర్తించి విడుదల చేయించడం వీరి బాధ్యత.
- భారత శిక్షాస్మృతి ప్రకారం.. ఒక వ్యక్తికి పడే గరిష్ట శిక్షలో సగం కాలం విచారణలో భాగంగా జైల్లో గడిపితే.. అతన్ని వ్యక్తిగత బాండ్ మీద రిలీజ్ చేయాలి. కానీ.. దేశ వ్యాప్తంగా వందలాది మంది ఈ గడువు ముగిసినా.. జైళ్లలోనే ఉంటున్నారు.
- దేశంలో జైళ్ల నిర్వహణకు సంబంధించి 'మోడల్ ప్రిజన్ మాన్యువల్ – 2016' ఒక ప్రామాణిక మార్గదర్శి. జైళ్లలో ఖైదీల సెపరేషన్ ఉంటుంది. విచారణలో ఉన్న ఖైదీలను.. ఇప్పటికే శిక్ష పడిన ఖైదీలతో కలిపి ఉంచొద్దు. ఇది వారిని నేరస్తులుగా మారకుండా చూసేందుకు ఉద్దేశించింది. కానీ, దాదాపు 8శాతం జైళ్లల్లో రద్దీ కారణంగా అందరినీ కలిపే ఉంచుతున్నారు.
- ప్రతి ఖైదీకి తన లాయర్‌తో ఏకాంతంగా మాట్లాడే హక్కు ఉంది. వారానికి కనీసం రెండు సార్లు కుటుంబ సభ్యులతో ములాఖత్ ఏర్పాటు చేయాలి. సిబ్బంది కొరత కారణంగా ములాఖత్‌లు అమలు కావడం లేవు. లాయర్లను సంప్రదించడం పేద ఖైదీలకు పెద్ద సవాల్‌గా మారింది. జైలు అధికారులు ఇచ్చే సమాచారంపైనే వారు ఆధారపడాల్సి వస్తున్నది.
- అండర్ ట్రయల్ ఖైదీలు జైల్లో అడుగుపెట్టినప్పుడు వారికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేయాలి. నిరంతరం డాక్టర్లు అందుబాటులో ఉండాలి. కానీ, జైళ్లలో మెడికల్ ఆఫీసర్ల పోస్టుల 40 శాతం వరకు ఖాళీగా ఉన్నాయి.
- ప్రతి ఖైదీకి నిర్ణీత స్థలం, గాలి, వెలుతురు ఉండాలి. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం.. ఢిల్లీ, యూపీ వంటి రాష్ట్రాల్లో జైళ్ల సామర్థ్యం 100 అయితే.. 180 మంది నుంచి 200 మంది ఉంటున్నారు. అంటే ఒకరి మీద ఒకరు పడుకోవాల్సిన పరిస్థితి.
- విచారణ ఖైదీలను కోర్టుకు తీసుకెళ్లేందుకు తగినంత పోలీసు సిబ్బంది కూడా లేదు. దీంతో విచారణలు వాయిదాపడుతున్నాయి. జిల్లా జడ్జీలు, మేజిస్ట్రేట్లు క్రమం తప్పకుండా జైళ్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలి. కానీ, ఇది నామమాత్రంగానే సాగుతున్నది.

## 30% మంది నిరక్షరాస్యులే

అండర్ ట్రయల్ ఖైదీల్లో దాదాపు 30 శాతం మంది నిరక్షరాస్యులు. మరో 40 శాతం మంది కేవలం పదో తరగతిలోపు చదువుకున్నవారే. చట్టంపై అవగాహన లేకపోవడం, పేదరికం, భయం వంటి కారణాలతో కనీసం బెయిల్ కు కూడా అప్లయ్ చేసుకోలేకపోతున్నారు. విచారణ ఎప్పుడు పూర్తవుతుందో తెలియక దేశంలో దాదాపు లక్ష మంది 2 నుంచి 5 ఏండ్ల వరకు జైల్లో గడిపినట్లు లెక్కలు చెప్తున్నాయి.

## దర్యాప్తులో ఎడతెగని జాప్యం

న్యాయ వ్యవస్థలో 'Bail is the rule, Jail is an exception' (బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు) అనే సూత్రాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పదే పదే గుర్తు చేస్తుంటుంది. ఒక ఖైదీ తనకు పడే శిక్షా కాలంలో సగానికి పైగా విచారణలో భాగంగా జైలులో గడిపితే, ఆ వ్యక్తికి బెయిల్ మంజూరు చేయాలని సెక్షన్ 436ఏ (సీఆర్ పీసీ) చెప్తున్నది. కానీ, క్షేత్రస్థాయిలో ఇది సరిగ్గా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. విచారణ, పోలీసుల దర్యాప్తులో ఎడతెగని జాప్యం, ఖరీదైన న్యాయ సాయం కారణంగా పేదలు జైళ్లలోనే చాలా మంది అండర్ ట్రయల్ ఖైదీలుగానే ఉండిపోతున్నారని ఆ మధ్య జాతీయ న్యాయ కమిషన్ తన నివేదికల్లో పేర్కొన్నది.





## అండర్ ట్రయల్ ఖైదీల హక్కులేంటి?

- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. ప్రతి ఖైదీకి తనపై ఉన్న కేసు విచారణ త్వరగా ముగించుకునే హక్కు ఉంది. ఏండ్ల తరబడి విచారణ పేరుతో జైల్లో ఉంచడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుంది.
- ఆర్టికల్ 39ఏ ప్రకారం.. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరఫున ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేయాలి. దీని కోసం ప్రతి జిల్లాలో లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ ఎస్ఏ) ఉంటుంది.
- అండర్ ట్రయల్ ఖైదీలు అయినప్పటికీ.. వారికీ గౌరవప్రదంగా జీవించే హక్కు ఉంటుంది. జైల్లో ఉన్నప్పుడు శారీరకంగా హింసించడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం చట్టవిరుద్ధం. సరైన ఆహారం, వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం పొందే హక్కు ఉంది.
- తనను ఎందుకు అరెస్ట్ చేశారు? తనపై ఏయే సెక్షన్లు పెట్టారు? బెయిల్ పొందే అవకాశం ఉందా? లేదా? అనే విషయాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చు.

## జడ్జీల కొరత కూడా కారణమే!

- దేశ జనాభాకు తగ్గట్లు జడ్జీలు లేరు.1987లోనే భారత న్యాయ కమిషన్ తన 120వ నివేదికలో.. ప్రతి 10 లక్షల మంది జనాభాకు 50 మంది జడ్జీలు ఉండాలని సిఫార్సు చేసింది. నేటికీ ఈ లక్ష్యం నెరవేరలేదు.
- ప్రస్తుతం ఇండియాలో ప్రతి 10 లక్షల మంది జనాభాకు 22 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు.
- అమెరికాలో ప్రతి 10 లక్షల మందికి 100 మందికి పైగా, కెనడాలో 75 మంది వరకు జడ్జీలు ఉన్నారు.
- జడ్జీల సంఖ్య తక్కువ ఉండటంతో పాటు ఉన్న పోస్టుల్లోనూ భారీగా ఖాళీలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టుల్లో మంజూరైన పోస్టుల్లో దాదాపు 35 శాతం ఖాళీగా ఉన్నాయి. జిల్లా, దిగువ కోర్టుల్లో సుమారు 6వేల జడ్జీల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.
- జడ్జీల కొరత కారణంగా దేశవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో కలిపి 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అండర్ ట్రయల్ ఖైదీలుగా చాలా మంది జైలు జీవితాన్ని గడపాల్సి వస్తున్నదని న్యాయ సలహాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## జస్టిస్ అమితాబ్ రాయ్ కమిటీ సిఫార్సులేంటి?

జైళ్లలో రద్దీని తగ్గించడం, ఖైదీల హక్కులను కాపాడటం కోసం జస్టిస్ అమితాబ్ రాయ్ కమిటీని గతంలో సుప్రీంకోర్టు నియమించింది. కమిటీ కీలక సిఫార్సులు చేసింది. అవి ఏమిటంటే..:

- ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలి.
- ఖైదీలను కోర్టుకు తీసుకెళ్లేందుకు పోలీస్ ఎస్కార్ట్ కొరత ఉంటే.. జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు జరిపించాలి. ప్రతి 30 మంది అండర్ ట్రయల్ ఖైదీలకు కనీసం ఒక లాయర్ అందుబాటులో ఉండాలి.
- జైళ్లలోనే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఖైదీలకు వారి కేసు పరిస్థితిని ఎప్పటికప్పుడు వివరించాలి.
- మహిళా ఖైదీలకు ప్రత్యేక గదులు, వైద్య సదుపాయాలు, వారితో పాటు ఉండే పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలి. మహిళా ఖైదీల కేసులను ప్రాధాన్య క్రమంలో విచారించాలి.
- జైళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్లు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పోస్టులను వెంట వెంటనే భర్తీ చేయాలి.

## దేశంలో 75% మంది వాళ్లే

ఇండియాలోని జైళ్లలో ఉన్న ఖైదీల్లో మెజారిటీ వాటా అండర్ ట్రయల్ ఖైదీలదే. మొత్తం ఖైదీల్లో 75% మంది అండర్ ట్రయల్ ఖైదీలేనని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్ బీ) లెక్కలు చెప్తున్నాయి. ప్రతి నలుగురిలో ముగ్గురు దోషులుగా తేలకుండానే కటకటాల్లో మగ్గుతున్నారు. విచారణ పేరిట ఏండ్లకేండ్లు జైల్లోనే ఉండిపోతున్నారు. కొందరైతే తమకు పడే గరిష్ట శిక్షా కాలం కంటే ఎక్కువకాలం విచారణ పేరుతో జైల్లోనే గడపాల్సి వస్తున్నది.

- దేశవ్యాప్తంగా 5.10 లక్షల మంది ఖైదీలు ఉండగా.. వీరిలో 3.80 లక్షల మంది (75 శాతం) అండర్ ట్రయల్ ఖైదీలే. అండర్ ట్రయల్ ఖైదీల లిస్టులో చూస్తే.. యూపీ ఫస్ట్ ప్లేస్‌లో ఉంది. ఇక్కడ 1.1లక్షల మంది అండర్ ట్రయల్ ఖైదీలుగా జైళ్లలో మగ్గుతున్నారు. 60వేల మందితో బిహార్ సెకండ్ ప్లేస్ లో ఉంది. 35వేల మందితో మహారాష్ట్ర మూడో స్థానంలో ఉంది.